వృత్తి విద్యా కోర్సుల్లో శిక్షణ

కామారెడ్డి రూరల్, మే 1: సెట్విన్ ద్వారా వృత్తి విద్యా కోర్సుల్లో శిక్షణ ఇవ్వనున్నట్లు సెట్విన్ కోఆర్డినేటర్ సయ్యద్ మొయిజుద్దీన్ బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. డీసీఏ, పీజీడీసీఏ, టైలరింగ్, ఫ్యాషన్ డిజైనింగ్, బ్యూటీషియన్, మగ్గం వర్క్, మొహందీ కోర్సులలో శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. కోర్సు ఫీజులో 50 శాతం రాయితీతో పాటు ఉచితంగా స్టడీ మెటీరియల్ అందిస్తామని తెలిపారు. కోర్సు పూర్తి చేసిన తరువాత సెట్విన్ సంస్థ ద్వారా సర్టిఫికెట్ అందజేస్తామని, ఈ అవకాశాన్ని జిల్లా యువత సద్వినియోగం చేసుకోవలసిందిగా ఆయన తెలిపారు.





ప్రచారానికి మిగిలింది పది రోజులే..!

- లోక్‌సభ ఎన్నికల ప్రచారానికి మిగిలింది 10 రోజులు మాత్రమే
- ఈనెల 13న పార్లమెంట్ పోలింగ్
- జిల్లాలో అంతంత మాత్రంగానే లోక్‌సభ ఎన్నికల హడావుడి
- పెద్దగా కానరాని ఎంపీ అభ్యర్థుల క్షేత్రస్థాయి ప్రచారం
- అంతర్గత సమావేశాల్లోనే అభ్యర్థుల ప్రచారం

కామారెడ్డి, మే 1(ఆంధ్రజ్యోతి): దేశవ్యాప్తంగా అన్ని రాష్ట్రాల్లో విడతల వారీగా లోక్‌సభ ఎన్నికలు జరగనున్నాయి. ఇందులో భాగంగా తెలంగాణ రాష్ట్రంలో నాలుగో విడతలో లోక్‌సభ ఎన్నికలు నిర్వహించేందుకు కసరత్తు చేపట్టారు. ఈ నెల 13న పార్లమెంట్ స్థానాలకు పోలింగ్ నిర్వహించనున్నారు. ఈ నేపథ్యంలో లోక్‌సభ ఎన్నికల ప్రచారానికి అభ్యర్థులకు కేవలం 10 రోజులు మాత్రమే ఉంది. ప్రచారానికి సరిపడ సమయం లేకపోవడంతో అభ్యర్థులు ప్రచారంపై వ్యూహాత్మకంగా ముందుకు పోతున్నారు. దేశం అంతటా లోక్‌సభ ఎన్నికల ప్రచారం కొనసాగుతుంటే జహీరాబాద్ పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలోని కామారెడ్డి జిల్లాలో మాత్రం లోక్‌సభ ఎన్నికల హడావిడి కనిపించడం లేదు. కాంగ్రెస్, బీజేపీ, బీఆర్ఎస్ అభ్యర్థులు నామినేషన్ వేసినప్పటికీ అంతర్గత సమావేశాల్లో నిమగ్నమయ్యారే తప్ప క్షేత్రస్థాయిలో ప్రచారం మాత్రం అంతగా కనిపించడం లేదు. ఎంపీ అభ్యర్థుల ప్రచారంపై ఎండల ప్రభావం తీవ్రంగానే పడుతోంది.

ఊపందుకోని ప్రచారం

జహీరాబాద్ పార్లమెంట్ నియోజకవర్గంలో నేటికి క్షేత్రస్థాయి ఎన్నికల ప్రచారం ఊపందుకోవడం లేదు. ఈ ఎంపీ సెగ్మెంట్ పరిధిలో రెండు జిల్లాలోని మొత్తం 7 అసెంబ్లీ నియోజకవర్గాల్లో రాజకీయ వేడి రాజుకోవడం లేదు. బీజేపీ, కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీల తరుపున బీబీ పాటిల్, సురేష్‌షెట్కార్, గాలి అనిల్ కుమార్‌లు బరిలో ఉన్నారు. కాంగ్రెస్ అభ్యర్థి సురేష్‌షెట్కార్ తరపున సీఎం రేవంత్‌రెడ్డి బహిరంగసభ, బీజేపీ అభ్యర్థి బీబీ పాటిల్ తరపున రెండు రోజుల కిందట అల్లాదుర్గ్‌లో ప్రదాని నరేంద్రమోదీ బహిరంగసభలో పాల్గొన్నారు. కానీ ఇంత వరకు కామారెడ్డి జిల్లాలో ఏ పార్టీకి చెందిన నాయకులు బహిరంగసభలు, సమావేశాలు ఏర్పాటు చేసిన దాఖాలాలు లేవు. ఈనెల 7న మాజీ సీఎం కేసీఆర్ బీఆర్ఎస్ తరపున కామారెడ్డిలో రోడ్‌షో నిర్వహించనున్నట్లు పార్టీ వర్గాలు పేర్కొంటున్నాయి. అభ్యర్థులు మాత్రం అంతర్గత సమావేశాలు, సమీక్షలు, కార్యకర్తలతో సమావేశాలతోనే సరిపెడుతున్నారు. క్షేత్రస్థాయిలో మాత్రం ప్రచారం నిర్వహించిన దాఖలాలు ఏమి కనిపించడం లేదు. ఇంకా 10 రోజుల గడువు మాత్రమే ఉండగా 7 నియోజకవర్గాల్లో ఎలా ప్రచారం చేస్తారనే చర్చ కొనసాగుతోంది.

ఎమ్మెల్యేలు, నాయకులపైనే ఆధారం

గడువు తక్కువగా ఉండటంతో ఎంపీ అభ్యర్థులు ప్రచార ప్రణాళికలపై తర్జన బర్జన పడుతున్నారు. జహీరాబాద్ పార్ల మెంట్ నియోజకవర్గం కామారెడ్డి, సంగారెడ్డి జిల్లాల పరిధిలో ఉంది. సంగారెడ్డి జిల్లా పరిధిలో జహీ రాబాద్, నారాయణఖేడ్, ఆందోల్ కామారెడ్డి జిల్లా పరిధిలో కామారెడ్డి, ఎల్లారెడ్డి, జుక్కల్, బాన్సువాడ అసెంబ్లీ నియోజక వర్గాలు వస్తాయి. ఈ ఏడు నియోజక వర్గాల్లో నాలుగు చోట్ల కాంగ్రెస్ ఎమ్మెల్యేలే ఉండగా కాంగ్రెస్ అభ్యర్థి సురేష్ షెట్కార్ సమావే శాలకు హాజరవుతున్నారు. ఎల్లారెడ్డి, జుక్కల్ ఎమ్మెల్యేలు అభ్యర్థి తరపున విస్తృతంగా ప్రచారం నిర్వహిస్తున్నారు. కామారెడ్డిలో రాష్ట్ర ప్రభుత్వ సలహాదారుడు షబ్బీర్‌అలీ ఆయా మండలాల్లో రోజుకో మీటింగ్ పెడుతూ క్యాడర్‌కు దిశా నిర్దేశం చేస్తున్నారు. బీజేపీ ఎంపీ అభ్యర్థి బీబీ పాటిల్ కామారెడ్డి ఎమ్మెల్యేతో పాటు పార్టీ ముఖ్యనేతలపైనే ఆధారపడి ఉన్నారు. కేవలం కామారెడ్డిలో మాత్రమే ఎమ్మెల్యే ఉండగా ఆయన సారథ్యంలో కామారెడ్డిలోని ఆయా మండలాల్లో పార్టీ కార్యకర్తలు, నాయకులు ప్రచారం కొనసాగిస్తుండగా, మిగిలిన చోట్ల బీజేపీ ఇన్‌చార్జీలు, క్యాడర్‌తో ముందుకు సాగుతున్నారు. అదే విధంగా బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి గాలి అనిల్‌కుమార్ ఇద్దరు ఎమ్మెల్యేలతో పాటు మిగితా నియోజకవర్గాల్లో పార్టీ ఇన్‌చార్జీలతో సమావేశాల్లో పాల్గొంటున్నారు. ఇలా ప్రధాన పార్టీలకు చెందిన ఎంపీ అభ్యర్థులు స్వయంగా ప్రచారం చేసేకంటే క్యాడర్ పైనే ఆధారప డాల్సిన పరిస్థితి నెలకొంటుంది.

ఆలస్యం చేస్తే ఆగమాగం

ప్రచార పర్వంలో అభ్యర్థులు ఆలస్యం చేస్తే చివరి సమయంలో ఆగమాగం కాక తప్పదనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఈ ఎన్నికల్లో కేవలం 10 రోజులే మిగిలి ఉంది. ఈ సమయంలోనే రెండు జిల్లాల పరిధిలోని 7 నియోజకవర్గాల్లో క్షేత్రస్థాయిలో ప్రచారం చేయాలి. ఈ నియోజకవర్గాల్లో గ్రామాలన్నీ తిరుగుతేనే అక్కడి ఓటర్లకు ఎంపీ అభ్యర్థిపై అవగాహన ఉంటుంది. అందుకు తగిన ఫలితం కూడా వస్తోంది. ఈ 10 రోజుల్లో తగిన ప్రణాళిక ఉంటేనే అనుకున్న లక్ష్యాన్ని చేరుకుంటారు. లేదంటే ఆఖరులో అయోమయంతో పాటు మానసిక ఒత్తిడికి గురవుతారనే చర్చ సాగుతోంది.

ప్రచారానికి ఎండ దెబ్బ

లోక్‌సభ ఎన్నికలకు సమయం లేకపోవడం. ఇప్పటికే క్షేత్రస్థాయి ప్రచారాన్ని ప్రారంభించాల్సిన అభ్యర్థులు వెనుకబడటం మరోవైపు ఎండలు భగభగ మండుతుండటంతో ప్రచారంపై తీవ్ర ప్రభావం పడుతోంది. ఎన్నికల ప్రచారానికి వేసవి తాపం అడ్డంకిగా మారుతోంది. కొద్ది రోజులుగా ఎండలు భగభగ మండుతున్నాయి. ఏప్రిల్ నెల నుంచే 40 నుంచి 44 డిగ్రీల ఉష్ణోగ్రతలకు చేరువవుతున్నాయి. కాలు బయట పెట్టాలంటేనే సూర్యుడి తాపానికి బెదిరిపోతున్నారు. రానున్న రోజుల్లో కూడా ఇంతకు మించిన ఎండలు ఉంటాయని తెలుస్తోంది. అభ్యర్థులతో పాటు కార్యకర్తల ప్రచారానికి సైతం ఎండలు ఆటంకం సృష్టించక మానవు.

పార్లమెంట్ ఎన్నికల నిర్వహణకు కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలి

● రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వికాస్‌రాజ్



వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న కలెక్టర్ జితేష్ వి.పాటిల్

కామారెడ్డి టౌన్, మే 1: పార్లమెంట్ ఎన్నికల నిర్వహణకు కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వికాస్‌రాజ్ జిల్లా అధికారులకు సూచించారు. బుధవారం ఇతర ఉన్నతాధికారులతో కలిసి హోం ఓటింగ్, ఓటర్ స్లిప్పుల పంపిణీ, వెబ్ క్యాస్టింగ్, తదితర అంశాలపై వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్లమెంట్ స్థానానికి పోటీలో ఉన్న అభ్యర్థుల సంఖ్య ఆధారంగా అవసరమైన అదనపు బ్యాలెట్ యూనిట్లు, ర్యాండమైజేషన్ ప్రక్రియ పూర్తి చేయాలని అన్నారు. ఈవీఎం యంత్రాలపై బ్యాలెట్ పత్రాల కమిషనింగ్‌కు ప్రణాళికా బద్ధంగా చర్యలు తీసుకోవాలని అన్నారు. పారదర్శకంగా హోం ఓటింగ్ ప్రక్రియ పూర్తి చేసేందుకు అధికారులు అవసరమైన చర్యలు తీసుకోవాలని తెలిపారు. అనంతరం కలెక్టర్ జితేష్ వి.పాటిల్ మాట్లాడుతూ పార్లమెంట్ ఎన్నికలు సజావుగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నామని, ఎన్నికల సంఘం మార్గదర్శకాల మేరకు నోడల్ అధికారులకు, వివిధ బృందాలకు ఎప్పటికప్పుడు దిశా నిర్దేశం చేస్తున్నామని తెలిపారు. జిల్లాలో 6,80,921 మంది ఓటర్లు ఉన్నారని, 913 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. ఇందులో 64 సమస్యాత్మక లోకేషన్లు, 183 సమస్యాత్మక పోలింగ్ స్టేషన్లను గుర్తించి తగు భద్రత చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. 516 కేంద్రాల్లో వెబ్ కాస్టింగ్ నిర్వహిస్తున్నామన్నారు. 72 శాతం ఓటర్లకు ఓటరు స్లిపులతో పాటు ఓటర్ గైడ్ పుస్తకాన్ని పంపిణీ చేశామని తెలిపారు. ఈనెల 13న ఉదయం 7 నుంచి సాయంత్రం 6 గంటల వరకు జరుగు పోలింగ్‌కు ఓటర్లు సాధ్యమైనంత వరకు ఉదయం వేళలోనే తమ ఓటు హక్కు వినియోగించుకునేలా అవగాహన కలిగిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో నోడల్ అధికారులు వరదారెడ్డి, శ్రీనివాస్, అంబాజీ, మధుసూదన్, మురళీకృష్ణ, విజయకుమార్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ప్రొఫెసర్ కోదండరాం

బీజేపీ భావ ప్రకటన స్వేచ్ఛ లేకుండా చేస్తుంది

● టీజేఎస్ రాష్ట్ర అధ్యక్షుడు కోదండరాం

కామారెడ్డి టౌన్, మే 1: బీజేపీ భావప్రకటన స్వేచ్ఛ లేకుండా నిరంతరం దాడి చేస్తుందని తెలంగాణ జన సమితి (టీజేఎస్) రాష్ట్ర అధ్యక్షుడు కోదండరాం అన్నారు. బుధవారం కామారెడ్డి కాంగ్రెస్ జిల్లా కార్యాలయంలో టీజేఎస్ పార్టీ ఆధ్వర్యంలో 'ప్రమాదంలో ప్రజాస్వామ్యం - బహిరంగ చర్చ' అనే అంశంపై రౌండ్‌టేబుల్ సమావేశంలో ఆయన మాట్లాడారు. రాజ్యాంగం అందరికీ సమాన అవకాశాలు కల్పించిందని, భావప్రకటన స్వేచ్ఛను కలిపించిందని, దేశ ప్రజాస్వామ్య వ్యవస్థ ప్రపంచంలోనే గొప్పదని అన్నారు. కానీ ఇప్పుడు మాత్రం కేంద్రంలోని బీజేపీ భావ ప్రకటన స్వేచ్ఛ లేకుండా నిరంతరం దాడి చేస్తుందని అన్నారు. ఎదిరించిన వారి మీద కేసులు పెట్టి దాడులు చేస్తున్నారని అన్నారు. కాకతీయ యూనివర్సిటీలో కవులు, రచయితల మీద దాడి భావప్రకటన స్వేచ్ఛ మీద దాడే అని అన్నారు. పెట్రోల్, డీజిల్ ధరలు అధికంగా పెంచడంతో సామాన్యుల మీద భారం పెరిగిందని వ్యవసాయ రంగంలో కూడా ధరలు అధికంగా పెరిగాయని అన్నారు. ఈ ఎన్నికల్లో బీజేపీ గెలిస్తే రాజ్యాంగానికి, దేశానికి ప్రమాదమని మతం పేరుతో భావోద్వేగాలను రెచ్చగొడుతున్నారని మనమందరం ఐక్యంగా ఉండి వారిని తిప్పికొట్టాలని అన్నారు. ఎలక్టోరల్ బాండ్ తెచ్చి అవినీతిని చట్టబద్ధం చేశారని బీజేపీకి ఎలక్టోరల్ బాండ్స్ ఇచ్చిన వారిని కేసుల నుంచి తప్పించారని అన్నారు. ప్రశ్నించే గొంతులను, ప్రతిపక్షాలను అణిచివేస్తున్నారని మొన్న జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో కేసీఆర్ నిరంకుశ ప్రభుత్వాన్ని ఓటగొట్టినట్టే ఈ పార్లమెంట్ ఎన్నికల్లో మోదీని, బీజేపీని ఓడగొట్టాలని అన్నారు. ఈ సమావేశంలో టీజేఎస్ జిల్లా అధ్యక్షుడు లక్ష్మణ్‌యాదవ్, సీపీఐ నాయకుడు నర్సింహారెడ్డి, బహుజన ఐక్యవేదిక జిల్లా అధ్యక్షుడు క్యాతం సిద్ధిరాములు, టీపీటీఎఫ్ రాష్ట్ర మాజీ అధ్యక్షుడు రమణ, కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు కైలాస్ శ్రీనివాస్‌రావు, యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు ఇలియాజ్‌అలీ, ఆయా పార్టీల నాయకులు, విద్యార్థి సంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

సురేష్ షెట్కార్‌ను గెలిపిస్తే

వెయ్యి కోట్లతో నియోజకవర్గాన్ని అభివృద్ధి చేస్తా..!

● ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావు



బైక్ ర్యాలీలో పాల్గొన్న ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావు

సదాశివనగర్, మే 1: కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి సురేష్ షెట్కార్‌ను గెలిపిస్తే రూ.1000కోట్లతో నియోజకవర్గాన్ని అభివృద్ధి చేస్తానని ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావు అన్నారు. బుధవారం మండలంలోని కుప్రియల్, మర్కల్, తిర్మన్‌పల్లి, సదాశివనగర్ గ్రామాల్లో బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలో ప్రధానంగా నీటి సమస్య ఉందని అందుకు 288 బోర్లు వేయించి నీటి వసతి కల్పించానన్నారు. రూ.128కోట్లతో అభివృద్ధి పనులు రెండు నెలల్లో చేసి చూపించానన్నారు. రాబోయే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిని ఎంపీగా గెలిపిస్తే నియోజకవర్గం మరింత అభివృద్ధి జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ శ్రీనివాస్‌రెడ్డి, మాజీ వైస్ ఎంపీపీ రూపేందర్‌రెడ్డి, రాష్ట్ర నాయకుడు భూమన్న, ఇర్షాదుద్దీన్, లింగాగౌడ్, మద్దెల భాగయ్య, నియోజకవర్గం యూత్ అధ్యక్షుడు సంపత్‌గౌడ్, బంటు భూమేష్, శంకర్‌నాయక్, గణేష్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

రైతుల కోసం కాంగ్రెస్ కృషి చేస్తుంది

● తెలంగాణ రైతు రక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షుడు పాకాల శ్రీహరిరావు

కామారెడ్డి టౌన్, మే 1: రైతుల కోసం కాంగ్రెస్ పార్టీ అహర్నిశలు కృషి చేస్తుందని తెలంగాణ రైతు రక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షుడు పాకాల శ్రీహరిరావు, టీపీసీసీ అధికార ప్రతినిధి పల్లె రాంచందర్‌గౌడ్ అన్నారు. బుధవారం కామారెడ్డి జిల్లా కేంద్రంలోని కాంగ్రెస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రజాపాలనతో మార్పు మొదలైందని, రైతుల కోసం పెట్టుబడి సాయం, రైతు కమిషన్ ఏర్పాటు చేయడంతో పాటు త్వరలో పంటల బీమా పథకం ప్రారంభం, ధరణి పోర్టల్ ప్రక్షాళనకు చర్యలు చేపట్టామని తెలిపారు. లక్షకుపైగా ధరణి సమస్యల పరిష్కారం కోసం చర్యలు తీసుకున్నామని తెలిపారు. అదేవిధంగా కౌలు రైతుల రక్షణ చట్టం తేవడానికి కృషి చేయడంతో పాటు రూ.97కోట్లతో రైతు నేస్తం తీసుకువస్తామని తెలిపారు. కేంద్రంలో కాంగ్రెస్ అధికారంలోకి రాగానే డాక్టర్ స్వామినాథన్ కమిషన్ రిపోర్టు ప్రకారం పంటలన్నింటికీ ఎంఎస్‌పీ నిర్ణయించడం జరుగుతుందన్నారు. దానితో రైతులు పండిస్తున్న ప్రధాన పంటలన్నింటికీ క్వింటాల్ ఒక్కంటికి రూ.వెయ్యి నుంచి మూడు వేల వరకు పెరిగే అవకాశం ఉందని తెలిపారు. పదేళ్ల మోదీ పాలనలో వందేళ్ల విధ్వంసం జరిగిందని అన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు గోనె శ్రీనివాస్, ఐరేని సందీప్, గుడుగుల శ్రీనివాస్, పంపరి లక్ష్మణ్, భైరం కుమార్, జహీరుద్దీన్, సిద్ధ రాములు తదితరులు పాల్గొన్నారు.

రేషన్ బియ్యం అక్రమ రవాణాకు కళ్లెం పడేనా?

- జిల్లాలో జోరుగా సాగుతున్న రేషన్ బియ్యం అక్రమ వ్యాపారం
- రేషన్ డీలర్లు, వ్యాపారుల కుమ్మక్కు
- పేద ప్రజల పొట్టగొడుతున్న బియ్యం వ్యాపారులు
- జిల్లాలో దాడులు జరిగినా తీరు మారని వైనం
- తనిఖీలు జరిగినప్పుడే అధికారుల హడావుడి

బాన్సువాడ, మే 1: దేశంలో దారిద్ర్యరేఖకు దిగువన ఉన్న పేదలందరికీ సబ్సిడీపై ప్రభుత్వం రేషన్ దుకాణాల ద్వారా సరుకులు సరఫరా చేస్తోంది. ఇదే అదునుగా భావించి అక్రమార్కులు రెచ్చిపోయి మరీ రేషన్ సరుకులను బ్లాక్ మార్కెట్‌కు తరలిస్తూ రెండు చేతులా సంపాదిస్తున్నారు. పట్టించుకోవాల్సిన అధికారులు ఇటువైపు కన్నెత్తి చూడకపోవడంతో అక్రమార్కులకు అడూ అదుపు లేకుండా పోతోంది. కామారెడ్డి, నిజామాబాద్ జిల్లాల్లో ఈ అక్రమ వ్యాపారం జోరుగా కొనసాగుతోంది. పేదలకు అందించాల్సిన బియ్యం రేషన్ డీలర్లు పక్కదారి పట్టించి వ్యాపారులకు అమ్ముకుంటున్నారు. ఇలా టన్నుల కొద్ది రేషన్ బియ్యం ప్రైవేటు వ్యాపారుల గోదాంలలోకి చేరుతోంది. వ్యాపారస్థులు రిటైల్‌లో బియ్యాన్ని అధిక ధరలకు అమ్ముకోవడంతో పాటు మిగిలిన బియ్యాన్ని రైస్‌మిల్లర్లకు విక్రయిస్తున్నారు. ఈ దందా గుట్టుచప్పుడు కాకుండా ఎన్నో రోజులుగా కొనసాగుతోంది. రైస్‌మిల్లర్లు రేషన్ బియ్యాన్ని రీసైక్లింగ్ చేస్తూ ప్రభుత్వానికే అంటగడుతున్నారు. ఇలా ఈ అక్రమ దందా యథేచ్ఛగా కొనసాగుతోంది. అక్రమ రేషన్ బియ్యం రవాణాకు కళ్లెం పడే దిశగా అధికారులు అడుగు వేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది. ఎన్‌ఫోర్స్‌మెంట్ అండ్ విజిలెన్స్ అధికారుల దాడుల్లో రేషన్ బియ్యం, నిల్వలు బయట పడుతున్నాయే తప్పా మిగతా సమయాల్లో ఈ దందా మూడు పువ్వులు, ఆరు కాయలుగా సాగుతుందనే ఆరోపణలు ఉన్నాయి. జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారుల దాడులు తూతూ మంత్రంగా చేస్తున్నారనే విమర్శలు ఉన్నాయి. ఇప్పటికైనా ఈ అక్రమ దందాను అరికట్టేందుకు జిల్లా ఉన్నతాధికారులు ప్రత్యేక చర్యలు తీసుకుని పేద ప్రజల బియ్యాన్ని పక్కదారి పోకుండా పకడ్బందీ నిఘాను ఏర్పాటు చేయాలని, అక్రమ వ్యాపారులపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

ఉభయ జిల్లాలో జోరుగా సాగుతున్న బియ్యం అక్రమ వ్యాపారం

కామారెడ్డి, నిజామాబాద్ ఉభయ జిల్లాల్లో గల రేషన్ దుకాణాల నిర్వాహకులు ప్రతీ నెల పేదలకు పంచాల్సిన బియ్యాన్ని పక్కదారి పట్టిస్తున్నారు. ఇలా క్వింటాళ్ల కొద్ది రహస్య స్థావరాల్లో నిల్వ చేసి వ్యాపారులకు అధిక ధరలకు విక్రయించుకుంటున్నారు. రేషన్ దుకాణాల్లో 1 రూ. కిలో బియ్యం ఉండడం, బహిరంగ మార్కెట్‌లో 20రూ.ల వరకు ఉండడంతో క్వింటాలు బియ్యం వెనుక సుమారు రూ.1800 వరకు దండుకుంటున్నారు. ఈ దందా జోరుగా కొనసాగుతోంది.

రేషన్ డీలర్లు, వ్యాపారుల కుమ్మక్కు

రేషన్ డీలర్లకు, బియ్యం వ్యాపారులకు మధ్య తత్సంబంధాలు నెలకొని ఉన్నాయి. రేషన్ డీలర్లు ప్రతీ నెల క్వింటాళ్ల కొద్ది రేషన్ బియ్యాన్ని బయటి వ్యాపారులకు విక్రయించుకుంటున్నారు. బయట వ్యాపారులు రేషన్ బియ్యాన్ని రేషన్ డీలర్ల నుంచి రూ. వెయ్యి నుంచి రూ.1200లకు కొనుగోలు చేసి అదే బియ్యాన్ని రూ.1800 క్వింటాలుకు విక్రయిస్తున్నారు. మరోవైపు వ్యాపారులు పెద్ద ఎత్తున రేషన్ బియ్యాన్ని పోగు చేసి రైస్‌మిల్లర్లకు సైతం విక్రయిస్తున్నారు. రైస్‌మిల్లర్లు వ్యాపారుల నుంచి కొనుగోలు చేసిన బియ్యాన్ని ప్రభుత్వానికి తిరిగి అంటగడుతున్నారు. ఈ దందా చైన్ సిస్టంలో కొనసాగుతోంది.

జిల్లాలో దాడులు జరిగినా తీరు మారని వైనం

పేద ప్రజలకు అందాల్సిన రేషన్ బియ్యాన్ని రేషన్ డీలర్లు, వ్యాపారులు పక్కదారి పట్టిస్తున్న క్రమంలో అధికారులకు రెడ్ హ్యాండెడ్‌గా పట్టుబడ్డారు. అయినప్పటికీ ఈ దందా యథేచ్ఛగా కొనసాగుతునే ఉంది. అధికారులు పట్టుకున్నప్పటికీ ఒత్తిడులకు తలొగ్గి వారిపై ఎలాంటి చర్యలు తీసుకోలేకపోతున్నారని విమర్శలు తలెత్తుతున్నాయి.




వందశాతం ఉత్తీర్ణత సాధించిన హసాకొత్తూర్ పాఠశాల విద్యార్థులు

హసాకొత్తూర్ పాఠశాలలో వంద శాతం ఉత్తీర్ణత

కమ్మర్‌పల్లి, మే 1: పదో తరగత పరీక్ష ఫలితాల్లో కమ్మర్‌పల్లి మండంలోని హసాకొత్తూర్ ఉన్నత పాఠశాల వందశాంత ఉత్తీర్ణత సాధించి మండలంలోనే వరుసగా 13వ సారి వంద శాతం రిజల్ట్ సాధిస్తూ ముందు వరసలో నిలిచింది. 2011-2012 విద్యా సంవత్సరం నుంచి వరుసగా వంద శాతం రిజల్ట్‌ను సొంతం చేసుకుంటూ వస్తుంది. వందశాతం రిజల్ట్ సాధించిన ఈ పాఠశాల కరోనా సమయంలోనూ రెండేళ్ల పోనూ 11సార్లు వరుసగా వందశాంత ఉత్తీర్ణతను సాధించి రికార్డుల్లో నిలిచింది. మండలకేంద్రానికి 4 కిలోమీటర్ల దూరంలో ఉన్న ఈ పాఠశాల గతంలో ఒక ఐఏఎస్ (కోట అంబరీష్ కలెక్టర్), ఒక ఐఎఫ్ఎస్ (పద్మనాభరెడ్డి ఇండియన్ సోషల్ ఫారెస్ట్) లాంటి వారిని అందించిన చరిత్ర ఈ పాఠశాల నిలిచింది. గతం నుంచి నేటి వరకు ఈ పాఠశాలలో చదివిన విద్యార్థులు ఎందరో ఉన్నత చదువుల్లో రాణిస్తున్నారు.

జీజీహెచ్‌లో ప్రత్యేక వైద్య శిబిరం

పెద్దబజార్, మే 1: జీజీహెచ్‌లో హజ్ యాత్రకు వెళ్లే యాత్రికులకు ప్రత్యేక వైద్య శిబిరం ఏర్పాటు చేసినట్లు ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ప్రతిమరాజ్ అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో హజ్ యాత్రకు వెళ్లడానికి ప్రత్యేక వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జిల్లా నుంచి హజ్‌యాత్ర వెళ్లడానికి 375 మంది యాత్రికులు నమోదు చేసుకోగా అందులో సుమారు 330 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి ఆన్‌లైన్‌లో నమోదు చేయడం జరిగిందన్నారు. అనంతరం ఆన్‌లైన్‌లో నమోదు చేసుకున్న వారికి వ్యాక్సినేషన్ ఇవ్వడం జరిగిందన్నారు. ఇందులో ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.

వీరన్నగుట్టలో ఉచిత వైద్య శిబిరం

రెంజల్,మే1: మండలంలోని వీరన్నగుట్ట గ్రామంలో సూర్య ఆరోగ్య సంస్థ ఆధ్వర్యంలో ఉచిత వైద్యశిబిరాన్ని ఏర్పాటు చేశారు. గత కొన్ని సంవత్సరాల నుండి జిల్లాలో సూర్య ఆరోగ్య సంస్థ ఆధ్వర్యంలో పలు వైద్య శిబిరాలను నిర్వహించడం జరిగిందని సంస్థ ఫౌండర్ సూర్య భగవాన్ అన్నారు. సుమారు 340మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ వైద్య శిబిరంలో లయన్స్ క్లబ్ నిజామాబాద్ గవర్నర్ లక్ష్మి, లయన్స్ నిజామాబాద్ సహారా సభ్యులందరు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ ఒకరి మృతి

కమ్మర్‌పల్లి, మే 1: గత నెల 28 న రోడ్డుప్రమాదంలో తీవ్రంగ గాయపడి ఆసుపత్రి చిక్సిపొందుతున్న శ్రీరాముల శ్రీకాంత్ (32) అనేవ్యక్తి బుధవారం మృతి చెందినట్లు ఎస్సై రాజశేఖర్ తెలిపారు. గత నెల 28న కోరుట్ల గ్రామానికి చెందిన శ్రీకాంత్ తన బైక్‌పై ముప్కాల్ వెళ్లి తిరుగు ప్రయాణంలో కమ్మర్‌పల్లి శివారులోని మార్కెట్ కమిటి చెక్‌పోస్టువద్ద మెట్‌పల్లి నుంచి వస్తున్న ఆటో ఎదురుగా ఢీకొట్టడంతో శ్రీకాంత్ తలకు బలమైనగాయాలయ్యాయి. చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందనట్లు తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేశామని ఎస్సై తెలిపారు.

'పేద ప్రజలకు అండగా కాంగ్రెస్ ప్రభుత్వం'

డొంకేశ్వర్, మే 1: పేద కుటుంబాలకు కాంగ్రెస్ పార్టీ అండగా ఉంటోందని ఆర్మూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జీ వినయ్‌రెడ్డి అన్నారు. బుధ వారం డొంకేశ్వర్ మండలంలోని అన్నారం, సిర్పూర్, నడ్కుడ, గాదేపల్లి, చిన్న యానం గ్రామాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. గ్రామాల్లో ఉపాధి హామీ కూలీల వద్దకు వెళ్లిన ఆయన కాంగ్రెస్ పార్టీ ప్రవేశపెడుతున్న సం క్షేమ థకాల గురించి వివరించి, వంద రోజుల్లో గ్యారెంటీలను అమలు చేసి ప్రజలకు సంక్షేమ పథకాలకు అందించామని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు భూమేష్‌రెడ్డి, దేగాం గంగారెడ్డి, బీసీసెల్ మండల అధ్యక్షుడు గణేష్‌గౌడ్, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

● క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభం

డొంకేశ్వర్ మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ పాఠశాలలో బ్రదర్స్ యూత్ ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన బార్ల సాయికిరణ్‌రెడ్డి స్మారక క్రికెట్ పోటీలు ఆర్మూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జీ పి.వినయ్‌రెడ్డి ప్రారంభించారు. ఈకార్యక్రమంటల పీఏసీఎస్ చైర్మన్ భరత్‌రెడ్డి, గోపిగౌడ్, రామకృష్ణ, శ్యామ్‌గౌడ్, బ్రదర్స్ యూత్ సభ్యులు సతీష్, ప్రశాంత్, అరుణ్, చింటు, తదితరులు పాల్గొన్నారు.


ఉపాధి హామీ కూలీలతో మాట్లాడుతున్న వినయ్‌రెడ్డి

జిల్లా సైక్లింగ్ సంఘం ఆధ్వర్యంలో పండ్ల పంపిణీ



పండ్లు పంపిణీ చేస్తున్న దృశ్యం

సుభాష్‌నగర్, మే 1: స్వర్గీయ భూలోకం చలపతిరావు 63వ జయంతి సందర్భంగా జిల్లా సైక్లింగ్ సంఘం ఆధ్వర్యంలో బుధవారం నగరంలోని స్నేహ సొసైటీలో పండ్లు పంపిణీ, అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా చలపతిరావు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యక్షులు రాజ్‌కుమార్, సూర్యప్రకాష్, సభ్యులు శ్రీధర్‌రావు, రాకేష్‌కుమార్, వినోద్‌రెడ్డి, సిద్దయ్య తదితరులు పాల్గొన్నారు.

టీపీసీసీ లీగల్ సెల్ వైస్ చైర్మన్‌గా దయాకర్‌గౌడ్

నిజామాబాద్ అర్బన్, మే 1: తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ లీగల్ సెల్ వైస్‌చైర్మన్‌గా జిల్లాకు చెందిన న్యాయవాది దయాకర్‌గౌడ్ నియామితులయ్యారు. రాష్ట్ర లీగల్ సెల్ అధ్యక్షుడు పొన్నం అశోక్‌గౌడ్ ఉత్తర్వులు జారీ చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా 11 మంది వైస్ చైర్మన్లు, 9 మంది కన్వీనర్లను నియమించగా దయాకర్‌గౌడ్‌ను రాష్ట్ర వైస్ చైర్మన్‌గా నియమించారు. గత 22 ఏళ్లుగా న్యాయవాదిగా పనిచేస్తూ జిల్లా కాంగ్రెస్ పార్టీలోను ఆయన కొనసాగుతున్నారు. తన నియామకానికి కృషి చేసిన రాష్ట్ర అధ్యక్షుడు పొన్నం అశోక్‌గౌడ్, జిల్లాకు చెందిన నాయకులు సుదర్శన్‌రెడ్డి, మహేష్‌కుమార్‌గౌడ్, షబ్బీ ర్ అలీ, మధుయాష్కి, ఇతర నేతలకు ధన్యవాదాలు తెలిపారు. జిల్లాలో కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి తనవంతు కృషి చేస్తానని ఆయన తెలిపారు.

ఘన్‌పూర్‌లో పడకేసిన పారిశుధ్యం



రోడ్డు ప్రవహిస్తున్న మురుగు నీరు



కాలనీలో మట్టిరోడ్డు

డిచ్‌పల్లి, మే 1: మండలంలోని ఘన్‌పూర్ పరిధిలో నూతనంగా ఏర్పాడ్డ బీసీ కాలనీ,మహాలక్ష్మీనగం కాలనీల లో మౌళిక వసతులు లేక స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కనీసం మురుగ కాల్వలు లేకపోవడంతో మురుగు రోడ్డుపై ప్రవహిస్తుంది. అంతర్గత రోడ్లు లేక వర్షకాలంలో బురదతో తీవ్ర ఇక్కట్లు పడుతున్నారు. ఈకాలనీలో నూతనంగా ఇండ్ల నిర్మాణాలు చేపడుతున్నారు. కాలనీలోని ఇండ్ల నుంచి వచ్చేట్యాక్స్‌లు మాత్రం పంచాయతీ అధికారులు ముక్కు పండి వసూళ్లు చేస్తున్నారు. కానీ మౌలిక సదుపాయాలు ఏర్పాటు చేయడం లేదు. చెత్త చెదారం రోడ్లపై పేరుకుపోతుంది. చెత్త సేకరించే టాక్టర్ సైతం ఈ కాలనీ కి రావడం లేదని కాలనీ వాసులు తెలిపారు. విద్యుత్ సౌకర్యాం లేక వీధి దీపాలు సైతం వెలగడం లేదు. ఈ విషయాలపై స్థానికులు గతంలో డీపీవో జయసుధకు స్థానికులు సైతం పిర్యాదు చేశారు. పిర్యాదు చేయడంతో కొన్ని రోజుల పాటు చెత్త సేకరించే టాక్టర్ వచ్చేది.తిరిగి గత ఆరు నెలల నుంచి కనీసం చెత్త సేకరించకపోవడంతో కాలనీల్లో దుర్గంధం వెదజల్లుతుంది. ఈ కాలనీ లోనే గతంలో మినీ కలెక్టరేట్ గా బాసిల్లిన టీటీడీసీ కేంద్రం ఉంది. ఇందులో ఇప్పటికే జిల్లా స్థాయి సమావేశాలు జరుగుతుంటాయి. జిల్లా అధికారులు వస్తుంటారు. కావున ఇప్పటికైన ఘన్‌పూర్ పంచాయతీ అధికారులు బీసీ కాలనీపై చిన్న చూపు చూడకుండా ప్రత్యేక శ్రద్ధ తో మౌళిక వసతులు కల్పించాలని కాలనీ వాసులు కోరుతున్నారు.

బీసీ కాలనీలో మౌలిక సదుపాయాలు కల్పించాలి

డిచ్‌పల్లి, మే 1: గత కొన్నేళ్లుగా మేము ఇక్కడే ఉంటున్నం. కాలనీలో మురుగు కాల్వ లు లేక మురుగు రోడ్లపై ప్రవహిస్తుంది. చేత్త సేకరన జరగ పో వడంతో రోడ్లపై చెత్త కుప్పలు పేరుకుపోయి పందులు సంచరిస్తున్నాయి. స్థాని కులు అనారోగ్యం భారిన పడే ఆ స్కారం ఉంది. కాలనీలో సీసీ రోడ్లు లేక వర్షకా లంలో తీవ్ర ఇబ్బందులు పడుతున్నం. విద్యుత్ లైట్లు సైతం వెలగడం లేదు. కాలనీలో పంచాయతీ అధికారులు మౌళిక సదుపాయాలు కల్పించాలి. కనీసం మిషన్ భగీరథ కుళాయి కనెక్షన్ లు ఇవ్వడం లేదు. బీసీ కాలనీ అభి వృద్ధిపై పంచాయతీ అధికారులు చిన్న చూపూ చూడటం సరికాదు.

- మేడిద నర్సవ్వ

త్వరలో మురికి కాల్వల నిర్మాణం చేపడుతాం: సునీల్

బీసీ కాలనీలో త్వరలో సీసీ రోడ్ల తో పాటు, డ్రైనేజీ వ్యవస్థను నిర్మా ణానికి ఉన్నతాధికారు లకు ప్రతి పాద నలు పంపిస్తాం. ఎలక్షన్ కో డు వల్ల అభివృద్ధి ప నుల్లో ఆలస్యం ఏర్పాడుతుంది. బీసీ కాల నీల్లో అన్ని రకాల మౌళిక సదు పాయాలు కల్పిస్తాం.

దేశం బాగుండాలంటే మోదీ మళ్లీ రావాలి

● నిజామాబాద్ బీజేపీ ఎంపీ అభ్యర్థి ధర్మపురి అర్వింద్



ఏర్గట్లలో మాట్లాడుతున్న బీజేపీ ఎంపీ అభ్యర్థి అర్వింద్

ఏర్గట్ల, మే 1: దేశం బాగుండాలంటే మళ్ళీ మోదీయే రావాలని బిజేపి ఎంపీ అభ్యర్థి ధర్మపురి అర్వింద్ అన్నారు. బుధవారం ఏర్గట్ల మండల కేంద్రంలో ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ అన్ని వర్గాల ప్రజలు ధైర్యంగా ఉండాలంటే మోడీ మళ్ళీ రావాలని, రోజుకు 18 గంటలకు పైగా దేశం కోసం పని చేసే ప్రధాని ఎవరు లేరని అన్నారు. ప్రపంచ దేశాల్లో భారతదేశానికి విలువ తెచ్చిన ఘనత మోడీయేనని అన్నారు. తమ విలువైన ఓటును బిజేపికి వేసి భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో బిజేపి నాయకులు ఎలేటి మల్లికార్జున్ రెడ్డి, ఎలేటినారాయణ రెడ్డి, గుండవిఠల్, వాసంమనోజ్, గడ్డం శ్రీని వాస్, ఇట్టెడిశ్యామ్, నాగరాజ్‌గౌడ్, పొత్కూరి మహేష్,తోకల నర్సయ్య కార్యకర్తలు పాల్గొన్నారు.

మోర్తాడ్: పసుపు పంట నిజామాబాద్ నుంచి రైతులు నేరుగా అమెరికాకు ఎగుమతి చేసే రోజులు రానున్నాయని దీని వల్ల పసుపు రైతులు రూ.30వేల వరకు ధర పొందుతారని నిజామాబాద్ బీజేపీ పార్టీ ఎంపీ అభ్యర్థి ధర్మపురి అర్వింద్ అన్నారు. బుధవారం రాత్రి మోర్తాడ్‌లో జరిగిన కార్నర్ సమావేశంలో ఆయన ప్రజలనుద్దేశించి మాట్లాడారు. అయోధ్యలో రామమందిర నిర్మాణం జరిగిన తర్వాతనే పసుపు ధరలు విపరీతంగా పెరిగాయని అన్నారు. మహిళ సంఘాలకు కేంద్ర ప్రభుత్వం రూ.6వేల300కోట్ల రుణాలు ఇచ్చిందని అన్నారు. జిల్లాలో 15లక్షల పై చిలుకు పేదకలు ఉచితంగా బియ్యం అందజేసింది, ఇంక ఐదేళ్ల కొనసాగుతుందని అన్నారు. పసుపు ద్వారా ఇతర దేశాల్లో అనేక మందులు, ఇతర వస్తువులు తయారు చేస్తున్నారని, నిజామాబాద్‌లో కూడా రైతులకు లబ్ధిచేకూరుతుందని అన్నారు. కాంగ్రెస్ పార్టీ గల్ఫ్‌బోర్డు ఏర్పాటు చేస్తామని మోసపు మాటలు చెబుతున్నారని, కాంగ్రెస్ ప్రణాళికలో ఎందుకు చేర్చలేదని విమర్శించారు. పాకిస్తాన్, అఫ్ఘానిస్థాన్ ఇతర దేశాల నుంచి వచ్చిన ముస్లీంలకు పౌరసత్వం అందిస్తే స్థానిక ముస్లీంలు నష్టపోతారని అర్వింద్ అన్నారు. ఈ పార్లమెంట్ ఎన్నికలు హిందువులకు ఎంతో అవసరమని నరేంద్రమోదీ మూడవ సారి ప్రధాని అయితే భారతదేశ అభివృద్ధి రూపురేఖలు మారుతాయని అర్వింద్ అన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు కమ్మర్‌పల్లి, మే 1: పసుపు రైతులు ధరలు పెరుగుతున్నాయన్న సంతోషంతో పాటు రానున్నరోజుల్లో జిల్లా లో పసుపు ద్వార వివిదకరాల ఉత్పత్తులు కార్మాణాలు ఏర్పాటు చేసి ఈ ఉత్పత్తును ఇతర రాష్ట్రలకు కాకుండా నేరుగా కంటేరన్నద్వార అమెరికాకే ఎగుమతులు చేసేవిదంగా ప్రణాలీకలు రూపొందిస్తున్నామని బీజేపి మూడవసారి అధికారంలోకి వచ్చిరాగానే ఈ ప్రక్రియ ప్రారంభమవుతుందని నిజామాబాద్ పార్లమెంట్ అభ్యర్థి ధర్మపురి అర్వింద్ అన్నారు. బుధవారం రాత్రి కమ్మర్‌పల్లి మండలకేంద్రంలో ఆయాన మాట్లాడుతు కాంగ్రెస్ ఆరుగ్యారంటీలు అటకెక్కాయన్నారు. ఈసారి చేస్తామని మల్లి ప్రజలముందుకు వస్తున్నారని బిసి, ఎస్సీ, ఎస్టీ రిజర్వేషన్‌లు ఎతతవేస్తారని అసత్యప్రచారాలు చేస్తున్నారనిఆరోపించారు. షుగర్ ఫ్యాక్టరీలు తెలిపిస్తామని ఊకదంపుడు హమీలిస్తున్నారు. ఫ్యాక్టరీలు స్టార్ట్ చేస్తామని వచ్చిన వ్యాపారుల నుండి కోట్లరూపాయల ముడుపులు ఆశించడంతో వెనక్కితగ్గారని అన్నారు. అదికేడ బీజేపీతోనే సాద్యమన్నారు. వారి మాటలు నమ్మవద్దన్నారు. గత ఎన్నికల్లో ఇచ్చిన మాట ప్రకారం పసుపు బోర్డు నరేంద్రమోదీ చలువవల్ల సాదించాగలిగానన్నారు. త్వరలోనే పసుపు ఉత్పత్తు తయాని కేంద్రాలు ఏర్పాటు చేసి నిరుద్యోగ యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామన్నాన్నరు. పసుపు పంట ధరలపై ముందు చూపులేకనే పసపు రైతులు దాగాలు పడ్డారని అన్నారు. పసుపుతో పాటు వివిద వివిద పంటలరైతులను ఆదుకునేందుకు బీజేపీ ముందుసూపుతో ఉందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం మద్యధరలపై పెట్టిన శ్రద్ద రైతులపై చూపలేదన్నారు. జ.క్రాన్ పల్లి లో విమాన శ్రయం ఏర్పాటు బీజేపీతోనే సాద్యమన్నారు. మహిళ సంఘాలకు రానున్నరోజులు మంచిరోజులు చూడనున్నారన్నారు. మరో ఐదేళ్ల ఉచిత రేషన్, మహిళసంఘాలకు త్వరలో డ్రోన్ లు అందజేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్వర్గ సభ్యులు ఏలే టీ మల్లికార్జున్ రెడ్డి, బద్దం లింగారెడ్డి, రెంజర్ల గంగారాం, మండల పార్టీ అద్యక్షుడు కట్ట సంజీవ్, చింత శ్రీకుమార్, రెంజర్ల గంగాదర్, చింత ప్రవీన్ తదితర బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

కబడ్డీ అసోసియేషన్ నూతన కార్యవర్గం ఎన్నిక

సుభాష్‌నగర్, మే 1: కబడ్డీ అసోసియేషన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులుగా ఆంద్యాల లింగయ్య, గంగాధర్‌రెడ్డిలు ఎన్నికయ్యారు. నగరంలోని డీఎస్ఏ స్విమ్మింగ్ పూల్‌లో ఎన్నికలను నిర్వహించారు. అన్ని స్థానాలకు ఉపసంహరణ అనంతరం ఏకైక పోటీదారులు ఉండటంతో నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షుడిగా ఎంవి సుబ్బారావు, శ్రావణ్‌రెడ్డి, బొబ్బిలి నర్సయ్య, హైదర్, గంగారెడ్డి, సంయుక్త కార్యదర్శులు రాజేశ్వర్,శ్రీనివాస్, ప్రశాంత్, రాజేందర్, అనురాధ, కోశాధికారి సురేందర్, ఈసీ మెంబర్లు కె.గంగాధర్, హరిచరణ్, వినోద్ నాయక్, గంగారెడ్డి, సంతోష్, శంకర్, రాజు, జ్యోతి, శ్రీనివాస్, రమేష్‌లు ఎంపికయ్యారు.

సీఎం చేతుల మీదుగా ముడుపు విప్పిస్తాం

బాల్కొండ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి : ముత్యాల సునీల్ కుమార్



పార్టీలోకి ఆహ్వానిస్తున్న ముత్యాల సునీల్‌కుమార్

ఏర్గట్ల, మే 1: ఏర్గట్ల మండలంలో రేవంత్‌రెడ్డి 'హాత్‌సే హాత్ జోడో' యా త్రలో భాగంగా ఏర్గట్లలో రేవంత్‌రెడ్డి ముఖ్యమంత్రి కావాలని కాంగ్రెస్ నాయకులు చెట్టుకు ముడుపుని కట్టారని, అట్టి ముడపుని నేడు ముఖ్య మంత్రి అయిన రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా అట్టి ముడుపుని విప్పి, ఏర్గట్ల అభివృద్ధి పాటుపడతానని బాల్కొండ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి ముత్యాల సునీల్ కుమార్ అన్నారు. బుధవారం మండలంలో ఎంపీ ఎన్నికల ప్రచారం లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో కాం గ్రెస్ పార్టీకి ఎంతో ఆదరణ అభిమానం ఉందని అదే నమ్మకాన్ని ఎంపీ ఎన్నికల్లో చూపించి జీవన్‌రెడ్డిని భారీ మెజార్టితో గెలిపించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా పార్టీ ఉపాధ్యక్షుడు శివన్నోల్ల శివకుమార్, మండలాధ్యక్షుడు సోమదేవరెడ్డి, జీవన్, కార్య కర్తలు పాల్గొన్నారు.

పంచాయతీ కార్మికులకు సన్మానం

వర్ని,మే1: వర్ని మండలం కూనిపూర్ గ్రామంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు పీసీసీ డెలిగేట్ డాక్టర్ కూనిపూర్ రాజారెడ్డి, మండల యువజన కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కృష్ణారెడ్డి ఆధ్వర్యంలో గ్రామ పంచాయతీ కార్మికులను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కార్మిక దినోత్సవం సందర్భంగా వారిని సన్మానించడం సంతోషంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, మాజీ సర్పంచ్ శశికళ కాంతారావు, మాజీ ఉప సర్పంచ్ రాంచందర్ రెడ్డి, అరుణ్ రెడ్డి, గోపూరి అనిల్, నారాగౌడ్, గిరి సాయిలు, లక్ష్మణ్, శంకర్, బాలు, పెద్ద రాములు, బసవయ్య, హన్మాండ్లు, వెంకటి, చందు, కేశవ్ తదితరులు పాల్గొన్నారు.

● వర్ని మండల కేంద్రంలో మేడే వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కే.శ్రీనివాస్, భాస్కర్, రవి, షైను, సత్యనారాయణ, పుల్లారావు, తదితరులు పాల్గొన్నారు.

మే డే సందర్భంగా కార్మికులకు సన్మానం



కార్మికులను సన్మానిస్తున్న జీజీఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు

ఆర్మూర్‌టౌన్ , మే1: పట్టణంలోని జీజీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో బుధవారం మేడే దినోత్సవాన్ని పురస్కరించుకొని కార్మికులను ఘనంగా సన్మానించారు. జీజీఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు లయన్ నివేదన్ పది మంది కార్మికులకు పట్టుశాలువ, మెమెంటోతో ఘనంగా సన్మానించి వారి సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో రోటరీ క్లబ్ ఆఫ్ ఆర్మూర్ ఆదర్శ్ మాజీ అధ్యక్షుడు డిజె.దయానంద్, జీజీ ఫౌండేషన్ ప్రతినిధులు బెల్దారి శ్రీనివాస్, డిజె.వికాస్, కైలాస్, వినోద్, తదితరులు పాల్గొన్నారు.

కార్మికులకు ఒక్కరోజు వేతనం పంపిణీ

కార్మిక దినోత్సవం సందర్భంగా మాజీమున్సిల్ వైస్‌చైర్మన్ మోత్కురి లింగాగౌడ్ బుధవారం 25మంది కార్మికులకు ఒక రోజు వేతనాన్ని అందజేశారు. ఈ సందర్భంగా బీడీకార్మికులకు 500మందికి ఉచిత బీమా సౌకర్యాన్ని కల్పిస్తానని ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో మోత్కురి విజయ, సింద్‌తేజ్, సందన్‌తేజ్, తది తరులు పాల్గొన్నారు.

వేసవికాలంలో నిరంతరం

విద్యుత్ సరఫరా చేయాలి

● టీఎస్ఎన్‌పీడీసీఎల్ సీజీఎం నోడల్ అధికారి బి.అశోక్

ఆర్మూర్‌టౌన్ , మే1: వేసవికాలంలో వినియోగదారులకు నిరంతరంగా విద్యుత్ సరఫరా చేయాలని టీఎస్ఎన్‌పీడీసీఎల్ సీజీఎం నోడల్ అధికారి బి.అశోక్ తెలిపారు. బుధవారం పట్టణంలోని ఆర్మూర్ సబ్‌స్టేషన్‌ను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. వినియోగదారులకు నిరంతరం విద్యుత్ కోసం చేసిన పనులపై ఆరా తీసి గృహ, వాణిజ్య, వ్యవసాయ, ఇతర వినియోగదారులకు నిరంతరం విద్యుత్ సరఫరా ఉండాలని, లోఓల్టేజీ, ఓవర్‌లోడ్ సమస్య రాకుండా చూడాలని వ్యవసాయ వినియోగదారులకు అదనపు బ్రేకర్‌లు, లైన్ కంట్రోల్ ఏబీ స్విచ్‌లు ఏర్పాటు చేయాలని అధికారులకు ఆయన సూచించారు. ఆయన వెంట జిల్లా పర్యవేక్షణ ఇంజనీర్ ఆర్.రవీందర్, డివిజనల్ ఇంజనీర్ సీహెచ్.హరిచంద్, ఏడీఈ శ్రీధర్, ఏఈలు మనిష, ఆశ్రిత, బాల్‌రాజ్, విద్యుత్ సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థి ఆత్మహత్యాయత్నం

నవీపేట,మే1: మండలంలోని మహంతంకు చెందిన ఉద్యమారి సాయిచరణ్ అనే విద్యార్థి టెన్త్‌లో తక్కువ మార్కులు వచ్చాయని ఆత్మహత్య యత్నానికి పాల్పడ్డాడు. స్థానికులు తెలిపిన ప్రకారం సాయిచరణ్ మండల కేంద్రంలోని మోడల్ పాఠశాలలో ఇటీవల టెన్త్ పూర్తి చేశాడు. మంగళవారం విడుదలైన టెన్త్ ఫలితాలలో సాయి చరణ్ 8.3జీపీఏ మార్కులు సాధించాడు. తనకు 9జీపీఏ మార్కులకు పైగా సాధిస్తాననే గట్టి నమ్మకంతో ఉన్న అతడు మార్కులు తక్కువ రావడంతో మనస్థాపం చెందాడు.మంగళవారం సాయంత్రం తన ఇంట్లో గడ్డి మందును సేవించాడు. ఈ విషయం ఇంట్లో ఎవరికి చెప్పకపోవడంతో విషయం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. బుధవారం ఉదయం అతడు వాంతులు చేసుకోవడంతో విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు వెంటనే అతనిని మండలంలోని ప్రైవేటు ఆసుపత్రికి తరలించి మెరుగైన చికిత్స కోసం జిల్లా కేంద్రంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చేర్పించారు. ప్రస్తుతం అతడుకోలుకుంటున్నాడని వారు పేర్కొన్నారు. ఈ విషయంపై ఎస్ఐ యాదగిరి గౌడ్‌ను వివరణ కోరగా తమకు ఎటువంటి ఫిర్యాదు అందలేదని అన్నారు.

బాధిత కుటుంబానికి గల్ఫ్ బ్రదర్స్ చేయూత



ఫిక్స్ డిపాజిట్ బాండ్‌లను అందజేస్తున్న గల్ఫ్ బ్రదర్స్ ప్రతినిధులు

జక్రాన్‌పల్లి, మే1: మండలంలోని పడకల్ గ్రామానికి చెందిన గల్ఫ్ కార్మికుడు తలారి ప్రసాద్ ఇటీవల గుండెపోటుతో మృతి చెందాడు. మృతుడు భార్య సవిత, ఇద్దరు కూతుళ్లు, కుమారుడు ఉన్నారు. ప్రసాద్ గల్ఫ్ దేశామైన దుబాయికి వెళ్తూ రెండు నెలల క్రితం శంషాబాద్ ఎయిర్‌పోర్టులో గుండెపోటుతో మృతి చెందారు. దీంతో బాధిత కుటుంబాన్ని ఆర్థికంగా ఆదుకోవాలన్నా సదుద్దేశంతో గల్ఫ్ బ్రదర్స్ అసోసియేషన్ సభ్యులు కొంత నగదును జమ చేశారు. ప్రతీఒక్కరు చేయిచేయి కలిపి బాధిత కుటుంబానికి ఆర్థికంగా చేయూతనందించారు. మృతుడు కూతుళ్ల అక్షర, ధరణి పేరుపై రూ.55వేల800 బ్యాంకులో ఫిక్స్ డిపాజిట్ చేశారు. అనంతరం బాధిత కుటుంబానికి డిపాజిట్ చేసిన బాండ్‌లను గల్ఫ్ బ్రదర్స్ ప్రతినిధులు అందజేజేశారు. ఆర్థికంగా సహకారం అందించిన గల్ఫ్ బ్రదర్స్ సభ్యులకు బాధిత సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో గల్ఫ్ బ్రదర్స అధ్యక్షుడు కృష్ణ, సభ్యులు అబ్బులు, గంగారాజు, నవీన్‌యాదవ్, తదితరులు పాల్గొన్నారు.

బస్సు, బైక్ ఢీ ఒకరి మృతి

నందిపేట, మే1: నందిపేట మండలంలోని ఉమ్మెడ గ్రామశివారులో బుధవారం ఆర్టీసీ బస్సు, బైక్ ఢీకొనడంతో మాయపూర్‌కు చెందిన మేకల సాయన్న(48) అనే వ్యక్తి మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం ఆర్టీసీ బస్సు ఉమ్మె డ నుంచి నందిపేట వైపు వెళ్తున్న మేకల సాయన్న కూలీ పనులు ముగించు కొని ఇంటికి తిరిగి మోటర్ సైకిల్‌పై వెళ్తుండగా బస్సు ఢీకొట్టింది. దీంతోవెనుక టైర్ ఆయన తలపై నుంచి వెళ్ళి ంది. మెదడు చిట్లిపోయి సా యన్న అక్కడి కక్కడే మృతి చెందాడు. మృతుడు రోజు వారి కూలీ పని చేసు కునే వాడని గ్రామ స్థులు తెలి పారు. కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమో దు చేసు కొని దర్యా ప్తు చేస్తున్నట్టు ఎస్సై జి.రాహుల్ తెలిపారు.



మృతుడు సాయన్న

ఘనంగా మే డే వేడుకలు

కామారెడ్డి టౌన్, మే 1: మే డే సందర్భంగా కామారెడ్డి జిల్లా కేంద్రంలో సీఐటీయూ, మున్సిపల్ యూనియన్, సీపీఎం, సీపీఐఎంఎల్, ఎంసీపీఐయూ ఆధ్వర్యంలో వివిధ ప్రాంతాల్లో జెండా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం వచ్చాక మతోన్మాద రాజకీయాలు చేస్తుందని కార్మికులను, కర్షకులను కులాల పేరుమీద విభజించి కార్మికుల హక్కులను నాశనం చేస్తూ కార్పొరేట్ కంపెనీల లాభాల కోసం కొత్త చట్టాలను తీసుకువచ్చిందని అన్నారు. కేంద్ర ప్రభుత్వం పోరాడి సాధించుకున్న హక్కులను కాలరాస్తు, పెట్టుబడిదారులకు అనుకూలంగా వ్యవహరిస్తుందని విమర్శించారు. కార్మికులు, రైతులు, నిరుద్యోగులు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నా పట్టించుకోవడం లేదన్నారు. కార్మికులకు సమాన పనికి సమాన వేతనం అందించడం లేదని అన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఎం పార్టీ జిల్లా కార్యదర్శి వెంకట్‌గౌడ్, సీఐటీయూ నాయకుడు చంద్రశేఖర్, మున్సిపల్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి రాజనర్సు, వాటర్‌వర్క్స్ అధ్యక్షుడు ప్రభాకర్, జిల్లా ప్రధాన కార్యదర్శి మోహబూబ్అలీ తదితరులు పాల్గొన్నారు.

బాన్సువాడ టౌన్: కేంద్రంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం కార్మిక వ్యతిరేక విధానాలతో కార్మికుల జీవితాలతో చెలగాటమాడుతుందని, కార్మికులంతా సంఘటితంగా పోరాడాలని పిలుపునిచ్చారు. బుధవారం మేడే సందర్భంగా పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తా వద్ద సీఐటీయూ ఆధ్వర్యంలో మేడే ఉత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్రం తెచ్చిన 44 చట్టాలను నాలుగు కోడ్లుగా విభజించి కార్మిక చట్టాలను తుంగలో తొక్కిందన్నారు. కార్మికులంతా ఏకమై పోరాటం చేసి ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకవచ్చి నాలుగు కోడ్‌లను తిప్పికొట్టాలన్నారు. కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి ఏనుగు రవీందర్‌రెడ్డి పాల్గొని కార్మికులకు మేడే శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కార్మిక నాయకులు బుజ్జిగారి సాయిలు, రాజు, విఠల్, శివరాజు, ఆశావర్కర్లు, మధ్యాహ్న భోజన కార్మికులు, అంగన్‌వాడీ, గ్రామ పంచాయతీ, మున్సిపల్ కార్మికులు తదితరులున్నారు.

దోమకొండ: మండల కేంద్రంలోని సీఐటీయూ ఆధ్వర్యంలో మేడే సందర్భంగా జెండా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నాగారపు ఎల్లయ్య మాట్లాడుతూ కార్మికుల హక్కుల కోసం పోరాడాలన్నారు. కార్యక్రమంలో సత్యం, సంతోష్, నర్సింలు, రాంచంద్రం తదితరులు పాల్గొన్నారు.

బీబీపేట: మండల కేంద్రంలో వెంకటేశ్వర తాపీమేస్త్రి సంఘం ఆధ్వర్యంలో మే డే పురస్కరించుకుని జెండా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కార్మికులు లేనిదే అభివృద్ధి లేదని అన్నారు. కార్మికుల హక్కులు నెరవేర్చి, కార్మికులకు అండగా ఉండేవిధంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పని చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో కార్మిక సంఘం అధ్యక్షుడు రాజు, కార్మికులు పాల్గొన్నారు.

ఎల్లారెడ్డి: ఎల్లారెడ్డి పట్టణ కేంద్రంలో 12వ వార్డు బీడీ కాలనీలో భవన నిర్మాణ కార్మికులు మే డే సందర్భంగా బుధవారం కార్మిక జెండా ఎగురవేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్మికుల చట్టాలుగా అమలు చేయాలని పది రంగాలకు సంబంధించిన కార్మికులకు మాత్రమే లేబర్ కార్డులు ఇవ్వాలని అన్నారు. 50 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరికి 7 వేల పెన్షన్ ఇవ్వాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎల్లారెడ్డి మండల కమిటీ అధ్యక్షుడు మర్లు సాయిబాబు, ఉపాధ్యక్షుడు సాయిలు, ప్రధాన కార్యదర్శి కాంతారావు, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.



కామారెడ్డిలో జెండా ఆవిష్కరిస్తున్న నాయకులు

భిక్కనూర్: మండల కేంద్రంతో పాటుగా మండలంలోని ఆయా గ్రామాల్లో మేడే ఉత్సవాలను బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మండల కేంద్రంలోని సినిమా టాకీస్ చౌరస్తాతో పాటుగా ఆయా గ్రామాల్లోని చౌరస్తాల వద్ద ఆటో యూనియన్, మేస్త్రీ సంఘం, హమాలి సంఘంతో పాటుగా పలు కార్మిక సంఘాల ఆధ్వర్యంలో యూనియన్ ప్రతినిదులు జెండా ఎగురవేసి స్వీట్లు పంచిపెట్టారు. జంగంపల్లి గ్రామంలో మల్లుస్వరాజ్యం కాలనీలో వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో మేడే ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు.

బీర్కూర్: బీర్కూర్ మండల కేంద్రంలో బుధవారం కార్మికులు మే డే వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. బీర్కూర్ కామప్ప చౌరస్తాలో కార్మికులు జెండా ఆవిష్కరించారు. అనంతరం మే డే ప్రాముఖ్యత గురించి కార్మికులకు వివరించారు. ఈ కార్యక్రమంలో కార్మికులు పాల్గొన్నారు.



ఎల్లారెడ్డిలో..



బాన్సువాడలో..



బీర్కూర్‌లో..



సబ్‌స్టేషన్‌ను పరిశీలిస్తున్న ఎస్ఈ

సబ్ స్టేషన్‌ను పరిశీలించిన ట్రాన్స్‌కో ఎస్ఈ

ఎల్లారెడ్డి, మే 1: ఎల్లారెడ్డి పట్టణ కేంద్రంలోని 33/11 కేవీ విద్యుత్ సబ్ స్టేషన్‌ను కామారెడ్డి జిల్లా విద్యుత్ శాఖ ఎస్ఈ రమేష్ బాబు బుధవారం తనిఖీ చేశారు. లైన్ ట్రిప్పింగ్‌లో ఓల్టేజ్ సమస్య తలెత్తకుండా ఎప్పటికప్పుడు సబ్ స్టేషన్లను స్థానిక అధికారులు సిబ్బంది సత్వర చర్యలు చేపట్టాలని సూచించారు. ఆయనతో పాటు డీఈ గణేష్, ఏడీఈ సుదర్శన్, ఏఈ సత్యనారాయణగౌడ్ తదితరులు పాల్గొన్నారు.



మద్యాన్ని స్వాధీనం చేసుకుంటున్న ఎస్సై

బెల్ట్ షాపుపై పోలీసుల దాడి

ఎల్లారెడ్డి, మే 1 : ఎల్లారెడ్డి మండలంలోని హాజీపూర్ తండాలో బెల్ట్ షాప్ నిర్వహిస్తున్నట్లు సమాచారం మేరకు మంగళవారం రాత్రి ఎల్లారెడ్డి ఎస్సై బొజ్జ మహేష్ సిబ్బందితో బెల్ట్ షాపుపై దాడి చేసి రూ.2986 వేల విలువ గల మద్యాన్ని స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. నిబంధనలకు విరుద్ధంగా బెల్ట్‌షాప్ నిర్వహిస్తున్న వ్యక్తిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపడుతున్నట్లు పోలీసులు తెలిపారు.



పోచారం భాస్కర్‌రెడ్డికి చికిత్స నిర్వహిస్తున్న వైద్యుడు

అయ్యప్ప ఆలయంలో వైద్య శిబిరం

బాన్సువాడ టౌన్, మే 1: పట్టణంలోని అయ్యప్ప ఆలయ ప్రాంగణంలో బుధవారం కేరళ వైద్యుడు ప్రశాంత్ ఆధ్వర్యంలో వైద్య శిబిరం నిర్వహించారు. బ్యాక్‌పెయిన్, మోకాళ్ల నొప్పులు, బీపీ, షుగర్ వంటి దీర్ఘకాలిక రోగులకు చికిత్సలు నిర్వహించారు. మాజీ డీసీసీబీ ఛైర్మెన్, బీఆర్ఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జి పోచారం భాస్కర్‌రెడ్డి శిబిరంలో పాల్గొని చికిత్స చేయించుకున్నారు. సుమారు 100 మంది రోగులకు చికిత్స చేసినట్లు ఆలయ కమిటీ అధ్యక్షుడు ముదిరెడ్డి విఠల్‌రెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా రైతు సమన్వయ సమితి అధ్యక్షుడు దుద్దాల అంజిరెడ్డి, గురువినయ్, తదితరులున్నారు.



అన్నారంలో కుస్తీ పోటీల్లో తలపడుతున్న మల్లయోధులు

అన్నారంలో రసవత్తరంగా కుస్తీ పోటీలు

పిట్లం, మే 1: మండలంలోని అన్నారం గ్రామంలో బుధవారం కుస్తీ పోటీలు నిర్వహించారు. కుస్తీ పోటీలకు మహారాష్ట్ర, కర్ణాటక, రాష్ట్రాల నుంచి కుస్తీ వీరులు వచ్చారు. ఉదయం నుంచే కుస్తీ పోటీలు రసవత్తరంగా కొనసాగాయి. కుస్తీ పోటీలు తిలకించడానికి ఆయా గ్రామాల నుంచి ప్రజలు భారీ సంఖ్యలో వచ్చారు. గ్రామపెద్దలు కుస్తీ పోటీల కోసం పూర్తి ఏర్పాట్లు చేశారు. గ్రామంలో ప్రతీ సంవత్సరం నల్లపోచమ్మ పండుగ సందర్భంగా గ్రామంలో బోనాలు తీసి కుస్తీ పోటీలు నిర్వహిస్తామని గ్రామస్థులు తెలిపారు. చివరి కుస్తీ 5 తులాల వెండిని గెలుపొందిన మల్ల యోధుడికి అందజేశారు.

జిల్లాలో 30 యాక్టు అమలు

కామారెడ్డి టౌన్, మే 1: జిల్లాలో 30 యాక్టు అమలులో ఉందని ఎస్పీ సింధూశర్మ బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ నెల 31 వరకు ఈ యాక్టు అమలులో ఉంటుందని తెలిపారు. అనుమతి లేకుండా ఎలాంటి సభలు, సమావేశాలు నిర్వహించినా నిబంధనలకు విరుద్ధంగా ర్యాలీలు నిర్వహించిన చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు. కావున జిల్లా ప్రజలు సహకరించాలని కోరారు.

వేసవిలో పోషకాల తాటి ముంజలు



తాటి ముంజలు విక్రయిస్తున్న దృశ్యం



తాటిముంజలు

- మార్కెట్‌లో జోరుగా విక్రయాలు

ఎల్లారెడ్డి, మే 1: వేసవి వచ్చిందంటే తాటి ముంజలు గుర్తొస్తాయి. ప్రకృతి సిద్ధమైన నీరు పోషకాలు కలిగిన తాటిముంజలు శరీరానికి ఎంతో చలువ చేస్తాయి. వేసవిలో ఎండ తీవ్రత నుంచి ఉపశమనం కలిగిస్తాయి. ఎలాంటి కల్తీ లేకుండా పోషకాలు అందించే తాటి ముంజలను కొనుగోలుకు ప్రజలు ఆసక్తి కనబరుస్తున్నారు. ఎల్లారెడ్డి పట్టణ కేంద్రంలో, బొగ్గు గుడిసె ప్రాంతంలో పెద్ద బజార్‌లలో చెల్ల కింద అమ్మకాలు జరుపుతున్నారు. వీటి ధరరూ.100కు డజన్‌గా విక్రయిస్తున్నారు.

ఆరోగ్యానికి ఎంతో మేలు..

తాటి ముంజలు వేసవిలో ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తాయి. తాటి ముంజలు తక్కువ శరీరానికి కావాల్సిన శక్తిని ఇస్తాయి. వేసవిలో ముఖం మీద ఏర్పడే చిన్న చిన్న మొటిమలను నివారిస్తాయి. లేత కొబ్బరిని పోలి ఉండే ముంజల్లో మినరల్స్ చక్కెర సమతుల్యంగా ఉంటాయి. ఇందులో విటమిన్, ఐరన్, కాల్షియం లభిస్తాయి. తాటి ముంజలు జీర్ణ వ్యవస్థను చురుకుగా పని చేస్తాయి. ఎసిడిటి వంటి సమస్యలను అధిగమించవచ్చు. శరీరానికి కావాల్సిన ఏబీసీ విటమిన్లు, ఐరన్, జింక్, ఫాస్పరస్, పొటాషియం వంటివి పుష్కలంగా ఉంటాయి. వీటిలో అధిక మొత్తంలో నీరు ఉండటంతో శరీర బరువు తగ్గుతుంది. కాలేయం సంబంధిత వ్యాధులు తగ్గించడంతో పాటు శరీరంలో విష పదార్థాలు నిల్వ ఉండకుండా చేస్తాయి. వేసవిలో వాంతుల నుంచి ఉపశమనం కలుగుతుంది. అంతేకాకుండా క్యాన్సర్ కణాలను సైతం నిర్వహిస్తుంది. ట్యూమర్ టెస్ట్ క్యాన్సర్ కణాలను అభివృద్ధి చేసే సైటు కెమికల్స్ అంతో సైనిక్ వంటి వాటిని నిర్మూలించడానికి తాటి ముంజలు ఉపయోగపడుతాయని వైద్యులు చెబుతున్నారు.

ముంజల్లో అనేక పోషకాలు..

: డాక్టర్ రవీంద్ర మోహన్, ఆసుపత్రి సూపరింటెండెంట్

వేసవిలో దొరికే తాటి ముంజల్లో ఎన్నో పోషకాలు లభిస్తాలయి. శరీరానికి కావాల్సిన విటమిన్లు ఉంటాయి. చాలా మంది ముంజలపై ఉన్న పై పొరలు తీసి తింటారు. కానీ పైపొర తీయకుండా తినాలి. పై పొరలలో కూడా పోషకాలు ఉంటాయి. శరీరానికి చలువ చేస్తుంది.



బస్ షెల్టర్‌ను ప్రారంభిస్తున్న లయన్స్ క్లబ్ గవర్నర్ లక్ష్మి

రెంజల్‌లో బస్‌షెల్టర్ ప్రారంభం

రెంజల్, మే1: నిజామాబాద్ జిల్లా రెంజల్ మండల కేంద్రంలో తహసీల్దార్ కార్యాలయం వద్ద లయన్స్ క్లబ్ జోన్ ఛైర్మన్ సూర్య భగవాన్ వారి తండ్రి జ్ఞాపకార్థం రెంజల్ మండల కేంద్రంతో పాటు వీరన్న గుట్ట గ్రామంలో ప్రజల సౌకర్యార్థం బస్ షెల్టర్‌ను ఏర్పాటు చేశారు. ఏర్పాటు చేసిన బస్ షెల్టర్ బుధవారం లయన్స్ క్లబ్ డిస్ట్రిక్ గవర్నర్ లక్ష్మి చేతుల మీదుగా ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజల సౌకర్యార్థం కోసం, విద్యార్థుల సౌకర్యార్థం బస్ షెల్టర్‌ను ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో అనేక సేవ కార్యక్రమాలు నిర్వహిస్తున్నందుకు ఆయనను ప్రత్యేకంగా అభినందించారు.ఈ కార్యక్రమంలో డిస్ట్రిక్ జనరల్ సెక్రెటరీ శ్రీనివాస్, జోన్ ఛైర్మన్ ఉత్తమ్ కుమార్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు మోబిన్‌ఖాన్, మాజీ జడ్పీటీసీ నాగభూషణం రెడ్డి, మార్కెట్ కమిటీ మాజీ వైస్ ఛైర్మన్ ధనుంజయ్, సాయిరెడ్డి, సాయిబాబా గౌడ్, లయన్స్‌క్లబ్ సభ్యులు ప్రవీణ్, వివేకానంద, నర్సింహరావు, ధనుంజయ రెడ్డి, పోశెట్టి తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ భద్రత వారోత్సవాలు ప్రారంభం

సుభాష్‌నగర్, మే 1: నిజామాబాద్ జిల్లాలో విద్యుత్ భద్రత వారోత్సవాలు ప్రారంభమయ్యాయి. ఈ కార్యక్రమాలను సీజీఎం, జిల్లా నోడల్ అధికారి బి.అశోక్ బుధవారం ప్రారంభించారు. ఈ భద్రత వారోత్సవాలు ఈనెల 7 వరకు కొనసాగుతాయని తెలిపారు. విద్యుత్ సంస్థలో పనిచేసే ఉద్యోగులందరూ భద్రత పట్ల అప్రమత్తంగా ఉండాలని కోరారు. సబ్‌స్టేషన్లు, లైన్‌లలో పనిచేసేవారు ఎప్పటికప్పుడు సమీక్షిస్తూ పనిచేయాలన్నారు. లైన్ క్లియరెన్స్ ఆఫ్ చేసి మరమ్మతులు చేయాలన్నారు. ట్రాన్స్‌ఫార్మర్ల మధ్య ఎర్తింగ్‌తో పాటు ఇతర అంశాలు పరిగణలోకి తీసుకొని భద్రత ఉండే విధంగా పనులు చేయాలని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్ఈ రవీందర్, డీఈ ఆపరేషన్ శ్రీనేఇవాస్, డీఈ టెక్నికల్ వెంకటరమణ, ఏడీఈలు ప్రశాంత్‌రెడ్డి, చంద్రశేఖర్, తోటరాజశేఖర్, వీరేశం, పట్టన ఏఈలు నాగశర్వాని, నగేష్, గంగాశేఖర్, శ్రీవిద్య పాల్గొన్నారు.

ఇస్కాన్ ఆధ్వర్యంలో వేసవి శిక్షణ శిబిరం

నిజామాబాద్ అర్బన్, మే 1: ఇస్కాన్ ద్వారకనగర్ ఆధ్వర్యంలో ఈనెల 12 వరకు నిర్వహించనున్న సంస్కార సమ్మర్ క్యాంప్ బుధవారం ప్రారంభమైంది. భగవత్ ఆరతి, దర్శనం, యోగా, మెడిటేషన్, ప్రసాదం, అల్పాహారాలు అందించిన అనంతరం భగవద్గీత శ్లోకాలు, సంస్కృతం, ఉత్సాహభరితమైన ఆటలు నిర్వహించారు. నగరంలోని వివిధ ప్రాంతాలకు చెందిన చిన్నారులు ఈ క్యాంపులో పాల్గొన్నారు. వ్యక్తిత్వ విలువలతో కూడిన విషయాలను, సహజంగా మట్టి వినాయకుల ప్రతిమలు, రాఖీ పండుగకు రాఖీలు, దీపావళికి ప్రమిదలు, హోలీకి సహజమైన రంగులను తయారు చేయడం తదితర విషయాలను ఈ క్యాంపులో నేర్పిస్తామని అధ్యక్షుడు సిద్ధ బాల రాందాస్ తెలిపారు. స్మార్ట్‌ఫోన్‌లు పిల్లలకు వ్యసనాలుగా మారడం వల్ల దాని వల్ల కలుగుతున్న నష్టాలను వివరిస్తూ భక్తిపాటలు, రామాయణం, మహాభారతం, తదితర విషయాలను పిల్లలకు నేర్పిస్తామన్నారు. ఈనెల 12తో శిక్షణ ముగుస్తుందని ఆయన తెలిపారు.



మండల టాపర్ విఘ్నేష్‌ను సన్మానిస్తున్న దృశ్యం

10/10 జీపీఏ సాధించిన విఘ్నేష్‌కు సన్మానం

బీర్కూర్, మే 1: మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు చెందిన పదో తరగతి విద్యార్థి యాట విఘ్నేష్ పది పరీక్షల్లో 10/10 జీపీఏ సాధించి మండల టాపర్‌గా నిలిచాడు. ఇదిలా ఉండగా బుధవారం బీర్కూర్ రెడ్ క్రాస్ సొసైటీ వారు విఘ్నేష్‌కు అభినందనలు తెలిపారు. అనంతరం ఘనంగా సన్మానించారు. భవిష్యత్తులో ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో రెడ్ క్రాస్ సొసైటీ సభ్యులు మేకల విఠల్, విజయ్, శశికుమార్, అశోక్, సుధాకర్ యాదవ్, యాట బుజ్జి, హమీద్ తదితరులు పాల్గొన్నారు.

ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు సన్మానం



విద్యార్థులను సన్మానిస్తున్న గ్రామస్థులు

భిక్కనూర్, మే 1: మండలంలోని అంతంపల్లి గ్రామానికి చెందిన చర్విత, వినూత్న అనే విద్యార్థినిలు ఇంటర్,పదోతరగతిలో రాష్ట్రస్థాయిలో ఉత్తమ ప్రతిభ కనబరచడంతో గ్రామస్థులు సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. విద్యార్థులు లక్ష్యసాధనకు కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో విండో ఛైర్మన్ వెంకట్‌రెడ్డి, ఎంపీటీసీ మంజుల, సంజీవరెడ్డి, మాజీ సర్పంచ్ మధుమోహన్‌రెడ్డి పాల్గొన్నారు.

వృద్ధులకు నిత్యావసర సరుకుల అందజేత



వృద్ధాశ్రమంలో వస్తువులను వితరణ చేస్తున్న దృశ్యం

కామారెడ్డి రూరల్, మే 1: మే డే సందర్భంగా విద్యుత్ ఉద్యోగుల సంఘం 1104 ఆధ్వర్యంలో జిల్లా విద్యుత్ కార్యాలయ ఆవరణలో జెండా ఆవిష్కరించారు. అనంతరం క్యాసంపల్లి వద్ద గల వృద్ధాశ్రమంలో 25 కేజీల బియ్యం, పప్పు దినుసులు వితరణ చేశారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు బి.కమలాకర్ మాట్లాడుతూ.. విద్యుత్ సంస్థలో అవసరానికి సరిపడా, కార్మిక చట్టాలకు లోబడి ఉద్యోగాల భర్తీ జరగడం లేదని ఇది బాధాకరమని తెలిపారు. ఖాళీగా ఉన్న ఉద్యోగాలను వెంటనే భర్తీచేయాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ కార్యక్రమంలో డివిజన్ కార్యదర్శి కృష్ణమూర్తి, జగదీష్, పార్వయ్య, రాములు, లింగం, నరేష్, రవీందర్, నర్సింలు, అనిల్, చంద్రమౌళి తదితరులు పాల్గొన్నారు.

కామారెడ్డిలో అత్యధికంగా 43.8 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదు

కామారెడ్డిటౌన్, మే 1: జిల్లాలో రోజురోజుకూ ఎండ వేడిమి ఎక్కువవుతోంది. జిల్లా వ్యాప్తంగా 43 డిగ్రీలకు పైగానే ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. బుధవారం కామారెడ్డిలో 43.8డిగ్రీలు, బిచ్కుంద 43.7, రామారెడ్డి 43.7, కోల్లూర్ 43.2, బీబీపేట 42.9, హసన్‌పల్లి 42.7, తాడ్వాయి 42.4, దోమకొండ 42.4, ఆర్గొండ 42.3, బీర్కూర్ 42.3, ఎల్పుగొండ 42.3, భిక్కనూర్ 42.3, సదాశివనగర్ 42.2, బొమ్మన్‌దేవాయిపల్లి 42.0, మాచాపూర్ 41.9, డొంగ్లి 41.9, లచ్చపేట 41.8, పిట్లం 41.8, నస్రూళ్లబాద్ 41.8, నాగిరెడ్డిపేట 41.7, మేనూర్ 41.7, పెద్దకొడప్‌గల్ 41.6, జుక్కల్ 41.5, సోమూర్ 41.4, సర్వపూర్ 41.4, లింగంపేట 41.1, ఇసాయిపేట 40.9, మక్దుంపూర్ 40.4, గాంధారి 40.3, పుల్కల్ 40.2 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది.

బాల్యవివాహం చేసిన పది మందిపై కేసు

రాజంపేట, మే 1: మండలంలోని ఓ మారుమూల తండాలో బాలిక వివాహం చేసినందుకు పది మందిపై ఫిర్యాదు చేసినట్లు జిల్లా పరిరక్షణ అధికారి మాలోత్ మోహన్ తెలిపారు. బుధవారం రాజంపేట పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో పెళ్లికి హాజరైన వారిపై, పెళ్లిచేసిన పంతులు, కుటుంబ సభ్యులపై పోలీసులు కేసులు నమోదు చేశారు. ఈ సందర్భంగా మాలోత్ మోహన్ మాట్లాడుతూ.. గతనెల 27న బాల్యవివాహం చేసేందుకు ప్రయత్నించగా బాలలపరిరక్షణ విభాగం అధికారులు అక్కడికి వెళ్లి కుటుంబసభ్యులకు కౌన్సెలింగ్ నిర్వహించారు. కానీ కుటుంబ సభ్యులు కౌన్సెలింగ్ అనంతరం వివాహం చేయమని చెప్పి మరుసటిరోజు ఎవరికీ తెలియకుండా వివాహం జరిపించారని అధికారులు తెలిపారు. బాలికకు వివాహం జరిపినందుకు పది మందిపై ఫిర్యాదు చేయడంతో పోలీసులు కేసు నమోదు చేశారని తెలిపారు.

సినిమా గైడ్ కామారెడ్డి



కామారెడ్డి	
దర్శన్	- మనజుమిల్ బాయ్స్
శాంతి	- టిల్లు స్క్వేర్
ప్రియా 70	- ది ఫ్యామిలీ స్టార్
ప్రియా 35	- గీతాంజలి మళ్లీ వచ్చింది

బాన్సువాడ	
మహేశ్వరి	- గీతాంజలి
వెంకటేశ్వర	- రత్నం

చికెన్ ధరలు



రకం	:	లైవ్	విత్‌స్కిన్	స్కిన్‌లెస్
సుగుణ (కిలో)	:	100	160	180
వెన్‌కాబ్(కిలో)	:	100	180	210

